రంజాన్ వేళలు

	ఇఫ్తార్(ఆదివారం)	సెహరీ(సోమవారం)
కర్నూలు	6:33 (సాయంత్రం)	5:02 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:14 (ఉదయం)
ఆదోని	6:35 (సాయంత్రం)	5:04 (ఉదయం)

సమరానికి సై



సార్వత్రిక సమరానికి నగారా మోగింది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) శనివారం పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో రాజకీయ పార్టీలు, ప్రభుత్వ విభాగాలు అప్రమత్తమయ్యాయి. షెడ్యూల్ వెలువడడానికి ముందు రోజు వరకు అధికార వైసీపీ ప్రజా ప్రతినిధులు, ఆ పార్టీ నేతలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారు. షెడ్యూల్ రాకతో ఒక్కసారిగా గప్‌చుప్ అయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో నాలుగో విడత ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ రావడానికి నేటితో 33 రోజులు, పోలింగ్‌కు 58 రోజుల గడువు ఉంటుంది. ఇది అభ్యర్థులకు ఖర్చుతో కూడుకున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. శనివారం నుంచే కోడ్ అమలులోకి రావడంతో జిల్లాలో ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే కార్యక్రమాలు ఆపేశారు. ఎన్నికలను టీడీపీ, వైసీపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో కందనవోలు ముంగిట సమరం రసవత్తరంగా మారనుంది.

- కందనవోలు ముంగిట ఎన్నికల వేడి
- షెడ్యూల్ ప్రకటనతో పార్టీలు అప్రమత్తం
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- జిల్లాలో 20,14,794 మంది ఓటర్లు
- మే 13న ఓటింగ్, జూన్ 4న కౌంటింగ్

ఎన్నికల షెడ్యూల్ ఇలా

- నోటిఫికేషన్ : ఏప్రిల్ 18
- నామినేషన్ల స్వీకరణకు ఆఖరు : ఏప్రిల్ 25
- నామినేషన్ పరిశీలన : ఏప్రిల్ 26
- ఉప సంహరణకు ఆఖరు : ఏప్రిల్ 29
- పోలింగ్ : మే 13
- ఓట్ల లెక్కింపు : జూన్ 4



కర్నూలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సచివాలయాల్లోని అధికార పార్టీ సామగ్రి బయటకు తరలిస్తున్నారు. కోడ్ అమలులోకి వచ్చినందున మద్యం, నగదు అక్రమ రవాణా సహా ఆన్‌లైన్ లావాదేవీలపైన నిఘా ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. సృజన తెలిపారు. ఆమెతో పాటు ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్యలు శనివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను ప్రధాన రహదారులపై చెక్ పోస్టులు ప్రకటించారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలతో పాణ్యం నియోజకవర్గం ఉంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆలూరు, ఆదోని మినహా ఆరు చోట్ల అభ్యర్థులను ప్రకటిస్తే.. వైసీపీ అభ్యర్థులను ఎనిమిది చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. ఇరు పార్టీలు రాజకీయ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు ప్రచార రథాలు, కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేం దుకు అధికార, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మే 13న జరిగే పోలింగ్‌లో జిల్లాలో 20,14,794 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఏప్రిల్ 19 వరకు ఓటరు నమోదు

ఏప్రిల్ 19 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని కలెక్టరు జి. సృజన తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నామినేషన్ దాఖలుకు పది రోజుల ముందు వరకు వచ్చిన ఫారం-6 దరఖాస్తులను పరిశీలించి అర్హుల పేర్లు అనుబంధ జాబితాలో చేరుస్తారు. జనవరి 22న విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ఓటర్ల మార్పు చేర్పులకు అవకాశం లేదు. కొత్తగా ఓటు నమోదుకు మాత్రమే చాన్స్ ఉంది. అలాగే సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్నిలకు సంబంధించిన ర్యాలీలు, సభలు, వాహనాలకు తప్పక అనుమతులు తీసుకోవాలి. కోడ్ అమల్లోకి రావడంతో ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వీక్షణ బృందాలు విధుల్లో ఉంటాయి. కోడ్ ఉల్లంఘన, అభ్యర్థుల ఖర్చు తదితర అంశాలను ఈ బృందాలు నిశితంగా పరిశీలిస్తాయి.

నియోజకవర్గం వారిగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
కర్నూలు	258	1,31,150	1,39,760	32	2,70,942
పాణ్యం	340	1,57,113	1,65,306	75	3,22,494
పత్తికొండ	255	1,09,673	1,09,943	23	2,19,639
కోడుమూరు(ఎస్సీ)	275	1,21,050	1,20,703	14	2,42,767
ఎమ్మిగనూరు	271	1,19,769	1,23,253	45	2,43,067
మంత్రాలయం	237	1,00,732	1.04,677	20	2,05,429
ఆదోని	256	1,27,798	1,29,682	49	2,57,529
ఆలూరు	294	1,27,600	1,26,273	54	2,53,927
మొత్తం	2,186	9,94,885	10,19,597	312	20,14,794



నగరంలో వైసీపీ ఫ్లెక్సీలను తొలగించి తీసుకెళ్తున్న నగర పాలక సంస్థ కార్మికులు

ప్రధాన పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు

నియోజకవర్గం	టీడీపీ/జనసేన/బీజేపీ కూటమి	వైసీపీ
కర్నూలు	టీజీ భరత్	ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్
కోడుమూరు(ఎస్సీ)	బొగ్గుల దస్తగిరి	ఆదిమూలపు సతీశ్
ఎమ్మిగనూరు	బీవీ జయనాగేశ్వరెడ్డి	బుట్టా రేణుక
మంత్రాలయం	ఎన్. రాఘవేంద్రరెడ్డి	వై.బాలనాగిరెడ్డి
పత్తికొండ	కేఈ శ్యాంబాబు	కంగాటి శ్రీదేవి
ఆలూరు	**ప్రకటించాల్సి ఉంది**	బి.విరుపాక్షి
ఆదోని	**ప్రకటించాల్సి ఉంది**	వై.సాయిప్రసాద్‌రెడ్డి
పాణ్యం	గౌరు చరిత	కాటసాని రాంభూపాల్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ, కలెక్టర్, జేసీ

కోడ్ కూసింది

ఎన్నికల షెడ్యూల్ వెలవడటంతో శనివారం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. సోషల్ మీడియాలో రాజకీయ ప్రకంపనలు సృష్టించేలా పెట్టే పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుంది. అభ్యంతరకరమైన, మతపరమైన పోస్టులు పెట్టేవారిపైనే కాకుండా గ్రూప్ అడ్మిన్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. రాజకీయ పార్టీ నాయకులు కులాలు, మతాలు, వేర్వేరు భాషలు మాట్లాడే ప్రజల మధ్య విభేదాలు, వైషమ్యాలు సృష్టించినా చర్యలు తీసుకుంటారు. నిర్ధారణ, రుజువులు లేకుండా ప్రత్యర్థి పార్టీ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయకూడదు. ఓట్ల కోసం కులాభిమానం, మత విశ్వాసాలు వాడుకోకూడదు. దేవాలయాలు, మసీదులు, చర్చీలు తదితర ప్రార్థనా మందిరాలను బరిలో ఉండే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోరాదు. కోడ్ అమలు లోకి వచ్చిన క్షణం నుంచే రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లరాదు. ఒకవేళ తీసుకెళ్లాల్సి వస్తే ఆధారాలు చూపించాల్సి ఉంటుంది.

మార్కెట్ కమిటీ లక్ష్యాలను అధిగమించాలి

- వసూళ్ల లక్ష్యం రూ.30.85 కోట్లు
- కడప మార్కెటింగ్ ఆర్జేడీ రామాంజనేయులు



జిల్లాలో మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఆర్జేడీ రామాంజనేయులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 16 : ఉమ్మడి జిల్లాలో ఉన్న మార్కెట్ కమిటీల ఆదాయపు లక్ష్యాలను ఈ నెలాఖరులోపు నూరు శాతం సాధించాలని కడప మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు అన్నారు. శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో జిల్లాలోని మార్కెట్ కమిటీల కార్యదర్శితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఏడాది ఆదాయపు లక్ష్యం రూ.30.85 కోట్లు అన్నారు. ఇందులో ఇప్పటి వరకు 96 శాతం.. రూ.29.85 కోట్లు వసూలు చేశామన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్ష్యంలో వెనుకబడి ఉందని అన్నారు. రూ16 కోట్ల లక్ష్యాన్ని ఇప్పటి వరకు రూ.12.86 కోట్లు సాధించారన్నారు. పాత బకాయిలపై దృష్టి సారించి మిగతా రూ.3 కోట్లు వసూలు చేయాలని సూచించారు. కర్నూలు రూ.6.18 కోట్ల లక్ష్యానికి రూ.6.90 కోట్లు, ఎమ్మిగనూరు రూ.4.5 కోట్లకు గాను రూ.5.5 కోట్లు, ఆలూరు రూ.80 లక్షలకు గాను రూ.1.12 కోట్లు, పత్తికొండ రూ.75 లక్షలకుగాను రూ72.5 లక్షలు, కోసిగి రూ.80 లక్షల గాను రూ1.30 కోట్లు, కోడుమూరు రూ.1.50 కోట్లకు గాను రూ.1.30 కోట్లు సాధించినట్లు తెలిపారు. పాత బకాయిలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల ఏడీఎంలు నారాయణమూర్తి రెహమాన్ ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కర్నూలు, కోసిగి కోడుమూరు పత్తికొండ మార్కెట్ కమిటీల కార్యదర్శులు రామ్మోహన్ రెడ్డి శాంత కుమార్, పద్మావతి, గోవిందు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసుల పరిష్కారం



రోడ్డు ప్రమాద కేసుల బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), మార్చి 16: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,219 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో అత్యధికంగా 534 కేసులు నంద్యాలలో 176, డోన్‌లో 151, ఆదోనిలో 83, ఆళ్లగడ్డలో 44, ఆలూరులో 31, ఆత్మకూరులో 32, బనగానపల్లెలో 28, కోయిలకుంట్లలో 32, నందికొట్కూరులో 44, పత్తికొండలో 19, ఎమ్మిగనూరులో 45 కేసులు పరిష్కారమైనట్లు ఆయన తెలిపారు. కర్నూలులో రిటైర్డు జిల్లా న్యాయాధికారి ఆధ్వర్యంలో జరిగిన మరొక లోక్ అదాలత్ బెంచిలో రోడ్డు ప్రమాదానికి సంబంధించిన 50 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.50 కోట్ల మేర నష్టపరిహారాన్ని ఇప్పించారు. ఈ లోక్ అదాలత్‌లో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి పి.పాండురంగారెడ్డి, జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.జ్యోత్స్నదేవి, ఎన్.వందన తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 16: జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను, ఎస్పీలను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

కలెక్టర్ డాక్టర్ జి. సృజన



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 16: ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం చిల్డ్రన్స్ పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిదన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన త్యాగ ఫలితంగా 1956 నవంబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని కొనియాడారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు శ్రీరాములు ఆద్యులని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ, చిల్డ్రన్స్ పార్కు ఎండీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వాళ్లకే..!



- ఎస్సీ, బీసీ, మైనార్టీ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరణ
- గెలవలేరంటూ అవమానించిన వైసీపీ
- సొంత సామాజిక వర్గం ఎమ్మెల్యేలకే ప్రాధాన్యం
- అనేక ఆరోపణలు ఉన్నా వారికే అవకాశం
- వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన

కర్నూలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, సీఎం జగన్ శనివారం జిల్లాలో పాణ్యంతో పాటు ఏడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. వారిలో పాత వారికే చాన్స్ ఇచ్చారు. ఎమ్మెల్యేలపై భారీ ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. మళ్లీ టికెట్ ఇస్తే గెలిచే అవకాశం లేదు.. మెజార్టీ ఎమ్మెల్యేలను మార్పు చేసి కొత్త వారికి అవకాశం ఇస్తామని గతంలో చెప్పారు. దీంతో తమకు అవకాశం వస్తుందని ఎన్నో ఏళ్లుగా వైసీపీని నమ్ముకొని రూ.కోట్లు ఖర్చు చేసుకున్న నాయకులు ఆశించారు. వారి ఆశలు ఎండమావులే అయ్యాయి. మళ్లీ పాత 'కాపు'లకే అవకాశం ఇచ్చారు. వయోభారం పేరుతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఒక్కడినే బలి చేసి.. తన సొంత రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అందరికీ టికెట్ ఇవ్వడం ఆ పార్టీలో చర్చగా మారింది. కేవలం ఎస్సీ, బీసీ, ముస్లిం మైనార్టీ ఎమ్మెల్యేలను ఒక్కటే మార్పు చేసి.. తన సామాజికవర్గం ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్లు ఇవ్వడం సామాజిక న్యాయమా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గడప గడపకు కార్యక్రమం విజయవంతంగా చేయడం లేదు. రాబోయే ఎన్నికల్లో ఓడిపోయే అవకాశాలు ఉన్నాయి. దీంతో చాలా మంది ఎమ్మెల్యేలకు ఈ దఫా టికెట్లు ఇచ్చే అవకాశాలు లేవని గతంలో జరిగిన ఓ సమావేశంలో సీఎం జగన్ పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఆ మాటలు నమ్మిన వైసీపీ శ్రేణులు పలువురు జిల్లాలో భారీ ఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు టికెట్లు రాకపోవచ్చని భావించారు. అభ్యర్థుల ప్రకటనతో జగన్ మాటల్లో విశ్వసనీయత లేదని, ఆయనను నమ్ముకొని మోసపోయామని ఆవేదన చెందుతున్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తనకు తప్పక టికెట్ వస్తుందని ఆశించారు. కేవలం ఎన్నికల షెడ్యూల్‌కు పదిరోజులు ముందుగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్న మాజీ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్‌కు మాత్రమే జగన్ అవకాశం ఇచ్చారు. కోడుమూరు (ఎస్సీ) ఎమ్మెల్యే డాక్టరు జరదొడ్డి సుధాకర్ వైసీపీ చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో ప్రథమ స్థానంలో ఉన్నారు. ఆయనను పక్కన పెట్టి నాన్ లోకల్ అయిన ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేశ్ తమ్ముడు ఆదిమూలపు సతీశ్‌కు టికెట్ ఇచ్చారు. ఆలూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంపై అవినీతి ఆరోపణలు వల్ల గెలవలేరని ఆయన వైరివర్గానికి చెందిన చిప్పగిరి జడ్పీటీసీ బి.విరుపాక్షిని సమన్వయకర్తగా ప్రకటించి టికెట్ ఇచ్చారు. చేనేతల్లో పద్మశాలి సామాజికవర్గానికి చెందిన కర్నూలు ఎంపీ డాక్టర్ సింగారి సంజీవ్ కుమార్‌కు కనీసం మాటమాత్రంగానైనా చెప్పకుండా ఎంపీ అభ్యర్థిగా మంత్రి జయరాం ను ప్రకటించారు. ఆయన తిరస్కరించడంతో మేయర్ బీవై రామయ్యను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. అంటే కేవలం ఎస్సీ, బీసీ, మైనార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీని మాత్రమే మార్పు చేసి వారి స్థానాల్లో కొత్తవారికి అవకాశం ఇచ్చారు.

పాత 'కాపు'లకే అవకాశం

ఆదోని నియోజకవర్గం ఎమ్మెల్యే వై.సాయి ప్రసా ద్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవి, పాణ్యం ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి గత ఎన్నిక ల్లో వైసీపీ టికెట్ పోటీ చేసి గెలిచారు. వీరిలో కొం దరిపై బలమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వీరిలో ఒక్కరిని కూడా మార్పు చేయలేదు. మళ్లీ వారినే అభ్యర్థులుగా జగన్ ప్రకటించారు. అంటే.. పాత 'కాపు'లకు మళ్లీ చాన్స్ ఇచ్చారు. పత్తికొండ నుంచి తమకు అవకాశం ఇవ్వాలని వైసీపీ నాయ కులు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎస్.రాచంద్రా రెడ్డి, ఎస్.నాగరత్నమ్మ దంపతులు టికెట్ ఆశించా రు. జగన్ మాత్రం శ్రీదేవికే అవకాశం ఇచ్చారు. అలాగే ఆదోని నుంచి ముస్లిం మైనార్టీ నాయకులు టికెట్ ఆశించారు. వీరితోపాటు వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మరో నాయకుడు కూడా ప్రయత్నాలు చేశారు. వీరిని కాదని తాజా ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్‌రెడ్డికే మరోసారి టికెట్ ఇచ్చారు. పాణ్యం నుంచి శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహా నగరపాలక సంస్థలో ప్రజా ప్రతినిధులుగా ఉన్న ఇద్దరు మహిళా నాయకులు కూడా ఆశిస్తూ- వారిని పక్కన పెట్టి మళ్లీ ఎమ్మెల్యే కాటసానికే అవకాశం ఇచ్చారు. అంటే జగన్ తన సొంత సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేల్లో కొందరిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. పైగా మళ్లీ పోటీ చేసేందుకు అభ్యర్థులుగా ప్రకటించారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



విభిన్న ప్రతిభావంతులకు పరికరాలను అందజేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు (న్యూసిటీ), మార్చి 16: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, అలిమ్‌కో ఆర్థిక సహాయంతో బీ క్యాంపులోని మన వృద్ధుల ఆశ్రమంలో విభిన్న ప్రతిభావంతులకు పరికాలు పంపిణీ చేశారు. శనివారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాయీస్ ఫాతిమా, కార్పొరేషన్ ఈడీ, డీసీ.రావ్, సీజీఎం డీపీ శతపతిల చేతుల మీదుగా 109 మంది లబ్ధిదారులకు పరికరాలను అందజేశారు. బ్యాటరీ ఆపరేటడ్ ట్రైసైకిల్, హియరింగ్ ఎయిడ్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్, చేతికర్రలు, వీల్ చైర్స్‌ను లబ్దిదారులు అందుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విభిన్న ప్రతిభావంతులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ జీవీ.సత్యనారాయణ, అలిమ్‌కో పీఓ శివశంకర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఎన్.వెంకటరామరాజు



నారా లోకేశ్‌తో ఎన్.వెంకటరామరాజు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 16: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకట రామరాజు తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు నివాసంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బ్రాహ్మణుల సమస్యలు, సంక్షేమం, కార్పొరేషన్ పునరుద్ధరణ కోసం నారా లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ప్రత్యేక పోలింగ్ స్టేషన్ల తనిఖీ



ఎస్ఏపీ క్యాంపులో పాఠశాలను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 16: సార్వత్రిక ఎన్నికల కోసం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ తనిఖీ చేశారు. ప్రతిపాదించడబడిన 5 పోలింగ్ స్టేషన్లు మోడల్ పోలింగ్ స్టేషన్, మహిళలచే నిర్వహించే పోలింగ్ స్టేషన్, యువత నిర్వహించే పోలింగ్ స్టేషన్, రెండు పీడబ్ల్యూడీ నిర్వహించే పోలింగ్ స్టేషన్ల కోసం పాఠశాల, కళాశాలలను ఆయన పరిశీలించారు. కమిషనర్ వెంట డీఈలు రవిప్రకాష్‌నాయుడు, రాజశేఖర్, ఏఈలు దినేష్, తదితరులు ఉన్నారు.

స్కేటింగ్ వేసవి శిక్షణ ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 16: కర్నూలులో స్కేటింగ్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కేటింగ్ కార్యదర్శి బైరెడ్డి పక్కిరెడ్డి, ఉపాధ్యక్షులు వి.సునీల్ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింగ్‌లో వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల పరీక్షల అనంతరం ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఐదేళ్ల పైబడిన చిన్నారులు అర్హులన్నారు. వేసవి శిక్షణకు అడ్మిషన్లు ప్రారంభించారనీ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లు నమోదు త్వరగా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9010501082 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 16: ఈ నెల 19 నుంచి 23 వరు వెస్ట్ బెంగాల్‌లోని హుంగ్లీ ప్రాంతంలో జరగబోయే 48వ జాతీయ స్థాయి సీనియర్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి తెలిపారు. శనివారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జిల్లా నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, యోగా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు: టీఎన్ అక్షర (21-25 విభాగంలో), ఈ.ఉమేష్ గౌడు (21-25) విభాగంలో, జేవీ రమణమూర్తి (45-ఆపై విభాగంలో), భవాని (25-30 విభగంలో), ప్రభావతి (30-35 విభాగంలో), కురువ మునిస్వామి (బిలో 30 ప్రొఫెషనల్ విభాగం).

సీఏ కోర్సుకు ఆదరణ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 16: సీఏ కోర్సుకు ఆదరణ పెరుగుతోందని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ సీఏ మట్టుపల్లి మోహన్ కుమార్ శనివారం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపు సీఏ చదవాలనుకునే వారికి అనువైన గ్రూపు అన్నారు. ఇంటర్‌లో ఏ గ్రూపు చదివినా సీఏ కోర్సు చదవడానికి అర్హులని తెలిపారు. డిగ్రీ చదివిన విద్యార్థులు నేరుగా ఎంట్రీ ద్వారా సీఏ కోర్సులో ప్రవేశం పొందవచ్చునన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

సి. బెళగల్, మార్చి 16: ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శకుంతల ఏపీవో లక్ష్మన్నకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డులో పేరు ఉన్న వారు మాత్రమే పనికి రావాలని చెప్పారు. జాబుకార్డులు లేనివారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉదయాన్నే పనులకు వెళ్లాలన్నారు. ఉష్ణోగ్రత పెరిగేలోపు పని ముగించుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడే చోట పనులు చేపట్టాలని అన్నారు.

సైలెంట్ కిల్లర్ 'గ్లకోమా'

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కంటి పై గ్లకోమా (నీటి కాసులు) వ్యాధి చడిచప్పుడు లేకుండా చూపును హరించి వేస్తుందని, ఇది సైలెంట్ కిల్లర్ అని సుశీల నేత్రాలయ అధినేత, సీనియర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ పి.సుధాకర్‌రావు హెచ్చరించారు. వరల్డ్ గ్లకోమా వీక్ ముగింపు సందర్భంగా శనివారం రాత్రి కర్నూలు సుశీల నేత్రాలయ వైద్యులు, సిబ్బంది కొవ్వొతుల ప్రదర్శన చేసి మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టు సావిత్రీ సుధాకర్, గ్లకోమా స్పెషలిస్టు విజయలక్ష్మి ఆళ్లే, రెటినా స్పెషలిస్టు నేహ సుధాకర్, శ్రీతేజ, ఆప్తమాలజిస్టు చరిష్మా వైద్యులు మేనేజర్ సింధు, సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొతుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీజీ భరత్



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, పరమేశ్వరరెడ్డి

ఆయన పోరాటం అజరామరం

రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయన 124వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని శ్లాఘించారు. ప్రజాస్వామ్య పోరాటానికి స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడి ప్రాణాలర్పినంచిన మహ నీయుడని కీర్తించారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

● ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

పొట్టి శ్రీరా ములుకు భారత రత్న ఇవ్వాలి

కర్నూలు(అర్బన్), మార్చి 16: పొట్టి శ్రీరాములు భారతరత్న ఇవ్వాలని కర్నూలు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని చిన్న అమ్మవారి శాల వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు కృషి, త్యాగం వల్లే తెలుగు మాట్లాడే వాళ్లమంతా కలిసి ఉన్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ వచ్చాక ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర సాధన కోసం జన్మించిన మహనీయుడని కొనియాడారు. 58 అడుగుల విగ్రహం ఏర్పాటుతోపాటు గన్నవరం విమానాశ్రయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టే విధంగా పార్టీ అధినేతతో చర్చిస్తానని తెలిపారు. పొట్టి శ్రీరాములుకు తెలుగుదేశం ప్రభుత్వం లోనే సముచిత గౌరవం కల్పిస్తామన్నారు. ఇక ఎన్టీఆర్‌తోపాటు పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వంలో ఇందుకోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు శేషగిరి శెట్టి, విఠల్ శెట్టి, మురళీ, నాగ వీరాంజనేయులు, చిన్న అమ్మవారిశాల సెక్రటరీ నందకిషోర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆయన సేవలు అజరామరం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

కర్నూలు(అర్బన్), మార్చి 16: రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు పాత్ర అజరామరమని డీసీసీ ఉపాధ్యక్షులు బీ బ్రతుకన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, మాజీ ఐఏఎస్ అధికారి రామస్వామి. పీసీసీ అధికార ప్రతినిధి రామాంజనేయులు, సత్యనారాయణ గుప్త, చంద్రశేఖర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఎ. వెంకటసుజాత, షేక్ ఖాజా హుసేన్, ఏలలిత, ఎజాస్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాములు

ఒకేషనల్ కళాశాలలో..

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 16: స్థానిక బీ క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్స్ నాగస్వామి నాయక్, పరమేశ్వర రెడ్డి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయశేఖర్, నాగ మోహన్, సోమేశ్, పార్థసారథి, పటేల్, జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మి, గిరిజారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న హనుమంతరావు చౌదరి

పోరాట స్ఫూర్తిదాత పొట్టి శ్రీరాములు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 16: ప్ర జాస్వామ్య పోరాటానికి స్ఫూర్తిదాత పొట్టి శ్రీరాములు అని తెలుగుదేశం పార్టీ సాం స్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి అన్నారు. పొట్టి శ్రీరాము లు 124వ జయంతిని పురస్కరించుకుని చిన్నపార్కులోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తన ప్రాణాలు అర్పించి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కల నెరవేరేలా చేసిన మహనీయుడన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీపద్మావతి పాల్గొన్నారు.

టీడీపీ కూటమి గెలిస్తేనే అభివృద్ధి



గౌరు దంపతుల సమక్షంలో టీడీపలో చేరుతున్న 34వ వార్డు వైసీపీ నాయకులు

● పాణ్యం అభ్యర్థి గౌరు చరిత

కల్లూరు, మార్చి 16: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాణ్యం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 34వ వార్డు హేమలత నగర్‌లో ఆమె శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500, తల్లికి వందనం ద్వారా చదువుకునే పిల్లలకు రూ.15,000, దీపం పథకం ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, యువగళం ద్వారా నెలకు రూ.3 వేలు, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, ప్రతిఇంటికి మంచినీటి కుళాయి, 50 ఏళ్ళు నిండిన బీసీలకు రూ.4వేల పెన్షన్, బీసీలకు రక్షణ చట్టంతో అండగా నిలవనున్నారని తెలిపారు. 48 నెలలుగా వైసీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రానున్న ఎన్నికల్లో ఓటు హక్కుతో జగన్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పీయూ మాదన్న, డీవీ చంద్ర, చాపల సురేష్, ఎన్‌వీ రామకృష్ణ, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జే గంగాధర్ గౌడ్, శ్రీరాములు, పవన్‌కుమార్, సంపతి లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 34వ వార్డుకు చెందిన 200 మంది వైసీపీ నాయకులు గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం హేమలత నగర్‌కు చెందిన చరణ్, మహేంద్ర ఆధ్వర్యంలో చిన్న, మధు, మహేంద్ర, ప్రశాంత్, విజయ్, సూరి, సందీప్, నవీన్, తెలుగు మధు, బాలాజీ, గిరి, రవి, షాషావలి, శుభంశీను తదితరులకు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు వైసీపీ ప్రభుత్వం వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పాణ్యం టీడీపీ ఇభ్యర్థి గౌరు చరితమ్మ గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

గూడూరు, మార్చి 16: గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు, చనుగొండ్ల, గుడిపాడు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. శనివారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు, చనుగోండ్ల, గుడిపాడు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో(ఎస్ఎస్‌బీ) పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాటాడుతూ రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఎలాంటి ఘర్షణలకు పాల్పడరాదని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐ హనుమంతయ్య పాల్గొన్నారు.

కొత్త డీఎంహెచ్‌వోకు అభినందనలు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కొత్త డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీక రించిన డా.వీ.ప్రవీణ్ కుమార్‌కు వైద్యులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వోను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీహెల్త్ అడ్మిని స్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘుబాబు సయ్యద్‌షఫి, సిటీ చైర్మన్ టి.గోవిందు, జిల్లా నాయకులు ఎం.వెంకట స్వామి, నాగన్న, మాలిక్‌బాషా తదితరులు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని వైద్యులందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు హరీష్ చంద్రారెడ్డి, మనోజ్, మిథున్, శ్రీలేఖ, శ్రీదేవి పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగరడం ఖాయం

కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి



మహిళకు అభివాదం తెలుపుతున్న బొగ్గుల దస్తగిరి

గూడూరు, మార్చి 16: టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరడం ఖాయమని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరు మండలంలోని మునగాల గ్రామంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకలను వివరించారు. గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, వైసీపీని ఇంటికి పంపడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, మునగాల కుంటిచేతి గోపాల్, మాజీ ఎంపీటీసీ రామచంద్రుడు, కౌన్సిలర్ బుడ్డంగలి, సృజన్, విజయ్ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోదా గోకులంలో గజ, హంస వాహన సేవలు



గజ వాహనంపై విహరిస్తున్న రంగనాథ స్వామివారు

కర్నూలు(కల్చరల్), మార్చి 16: నగర శివారు మామిదాలపాడులోగల గోదా రంగనాథ స్వామి వారి దేవస్థానం (గోదాగోకులం)లో కొన సాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ఉదయం గజ వాహన, సాయంత్రం హంస వాహన సేవలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో నిత్య కార్యక్రమాల్లో ఉదయం వేకువ జామును ప్రాతఃఆరాధన, అర్చనలు, సేవా కాలం, ధ్వజ కుంభారాధన, హోమం నిర్వహించి స్వామి వారికి ప్రసాదాలు నివేదించారు. అనంతరం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. గోదా గోకులం భజన బృందం ఆధ్వర్యంలో సాయంత్రం శ్రీరంగనాథ స్వామి వారికి కీర్తిస్తూ భజనలు చేశారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీ, త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీ, ప్రయాగరాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామీల నేతృత్వంలో, శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేశ్ భట్టర్, కిరణ్ భట్టర్లు శాస్త్రోక్తంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్దన్, తల్లం సురేష్ తదితరుల భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెద్దాసుపత్రిలో చలివేంద్రాలు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శ్రీసద్గురు దత్త కృపాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాలను శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. శ్రీ సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు శ్రీగురు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్, పాత 24 ల్యాబ్, రెండో జీవనాధార మెడికల్ షాపు దగ్గర చలివేంద్రాలను సూపరింటెండెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షురాలు మాతా కృష్ణకుమారి, అధ్యక్షులు జి.మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు డి.రాకేష్, నిర్మలారెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌గుప్త, అడిషినల్ సెక్రటరీ తారక్, హరినాథరెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు లేని నగరంగా తీర్చి దిద్దుతా : టీజీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 16: సమస్యలు లేని నగరంగా కర్నూలును తీర్చి దిద్దుతానని నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని మొదటి వార్డులోని ఖండేరీ, చిదంబరావు వీధుల్లో టీజీ భరత్ భరోసా యాత్ర సాగింది. ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పతకాల మేనిఫెస్టోతోపాటు ఆయన ఆరు గ్యారెంటీల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను చూపించి ఈ సమస్యలు తీర్చాలని మొరపెట్టుకున్నారు. శుక్రవారం జమ్మిచెట్టు వద్ద విద్యుత్ స్తంభం మండిపోయిన దృశ్యాలను చూసి భయాందోళనకు గురయ్యామని తెలిపారు. ఈ కరెంట్ తీగలను ఇలాగే వదిలిస్తే తమ ఇంటి వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంటుందన్నారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూల్లో ఉన్న సమస్యలు పదేళ్ల నుంచి చూసి ఆరు గ్యారంటీలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాస్కర్, హమీద్ బాషా, రమీజ్, ఆయాత్‌బీ, ప్రబాకర్, మున్నా, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేపథకాలు కొనసాగుతాయి'

టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకా లు ఉండవని దుష్ప్రచారం చేసే వారిని నమ్మవద్దని టీడీపీ కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని 15 వార్డు బుధవారపేటలో ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన రాఘవేంద్ర, శ్రీకాంత్, సింహాద్రి, రమేష్, రాజు, సుధీర్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడరుతూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెచ్చిన పలు పథకాలను గతంలో చంద్రబాబు నాయుడు కొనసాగించారని గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన పథకలా ను పకడ్బందీగా అర్హులైన ప్రతిఒక్కరు అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకు జేమ్స్, నాగరాజు, బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచే విద్య అవసరం



హొరిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య తదితరులు

కర్నూలు(కల్చరల్), మార్చి 16: పిల్లలకు సృజనాత్మక శక్తిని పెంపొందించే విద్య అందించాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. శనివారం నగరంలోని గణేశ్ నగర్‌లోగల హొరిజన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవ కార్య క్రమం టీజీవీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జి. పుల్లయ్య, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, విశ్వభారతి చిన్న పిల్లల వైద్య నిపుణురాలు శ్రావ్యారెడ్డి హాజరయ్యారు. హొరిజన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ సీఈఓ ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రీయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియదర్శిని మాట్లాడుతూ హొరిజన్స్ స్కూల్ యాజమాన్యం నూతన ప్లేవే మెథడ్‌లో విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికితీయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ పావని తదితరులు ప్రసంగించారు. అనంతరం బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి.

ముగిసిన గురు వైభవోత్సవాలు

- ఘనంగా రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజు వేడుకలు
- నవరత్నాల రథంపై స్వామివారు
- టీటీడీ నుంచి పట్టువస్త్రాలు
- 350 మంది విద్వాంసులచే సంగీత కార్యక్రమం
- రాఘవరాయలకు పుష్పాలంకరణ


నవరత్నాల రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, మార్చి 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు ముగిశాయి. శనివారం రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజు వేడుకలు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి జీఈవో వీరబ్రహ్మం అధికారికంగా పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం రాఘవేంద్ర స్వామిని వైభవంగా ఊరేగించారు. ఆ తర్వాత ఊంజల మండపంలో వెండి సింహాసనంపై రజిత రాఘవేంద్ర స్వామి కవచాన్ని ఉంచి వెండి వీణకు ప్రత్యేక అభిషేకాలు, హారతులు చేశారు. రాఘవరాయలను వివిధ రకాల పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, బీఎం ఆనందరావు, వాదిరాజాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు రవికులకర్ణి, అనంతపురాణిక్, విజేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకున్న భరత నాట్యం

గురు వైభవోత్సవాల్లో చివరి రోజు రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని శనివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో బెంగళూరుకు చెందిన నాట్య బృందం చేసిన భరతనాట్యం భక్తులను అలరించింది. బెంగళూరుకు చెందిన చంద్రిక గురురాజ్ వారి దాసవాణి సాహిత్యం భక్తులను కనువిందు చేసింది.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం

మంత్రాలయం, మార్చి 16. మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాల్లో ముగింపు రోజు రాఘవేద్రస్వామి 429వ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం రాత్రి యోగీంద్ర కళామంటపంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ నూనెపల్లె, ఆర్అండ్‌బీ ప్రిన్సిపాల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, కర్ణాటక హైకోర్టు అడిషనల్ జనరల్ శాంతి భూషణ్, బెంగుళూరు, రాయచూరు సీనియర్ న్యాయవాదులు ఎస్‌పీ శంకర్, ఎస్‌కే పురోహిత్, చెన్నైకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రమోద్‌లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, ఆర్అండ్‌బీ ఎస్సీలు నాగరాజు, హరిప్రసాద్, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ నాగరాజు, ఆర్డీఓలు నాగేంద్ర, సుధాకర్‌రడ్డి, శశిరదీప్తి, రమేష్, బాబు కిషోర్, ఎస్ఐ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


టీటీడీ పట్టువస్త్రాలను తలపై మోసుకుని వస్తున్న పీఠాధిపతి


రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు


టీటీడీ పట్టువస్త్రాలను బృందావనం ముందు ఉంచి పూజలు చేస్తున్న పీఠాధిపతి


ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్‌కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

దారి దోపిడీ

- నల్లమల ఘాట్‌లో రెండు లారీలను అటకాయించిన దుండగులు
- డ్రైవర్లను కిడ్నాప్ చేసి మిరప బస్తాలను తీసుకెళ్లిన వైనం


దోపిడీకి గురైన లారీలు

పాణ్యం, మార్చి 16: మిరప లోడుతో వెళ్లిన రెండు లారీలను గుర్తు తెలియని వ్యక్తులు అటకాయించి దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం పాణ్యం మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... పాణ్యం మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన కాశిరెడ్డి మహేంద్రారెడ్డి 25 ఎకరాల్లో మిరప పంట సాగు చేశాడు. శనివారం ఉదయం 8 గంటలకు దాదాపు రూ.30 లక్షల విలువ చేసే పంటను రెండు లారీల్లో గుంటూరుకు తరలించాడు. లారీల వెంట డ్రైవర్లతోపాటు కమీషన్ వ్యాపారి షరీఫ్ కూడా వెళ్లాడు. 11 గంటలకు శిరివెళ్ల మండలం పచ్చర్ల దాటిన తర్వాత చింతమాను టర్నింగ్ వద్ద మూడు వాహనాల్లో గుర్తు తెలియని 20 మంది వ్యక్తులు లారీలను అటకాయించారు. లారీ డ్రైవర్లు నరసింహ, శేఖర్, కమీషన్ వ్యాపారిని కొట్టి కళ్లకు గంతలు కట్టారు. అనంతరం వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు లాక్కొని స్విచ్చాఫ్ చేశారు. వారిని తమ వాహనాల్లో ఎక్కించుకొని తీసుకువెళ్లారు. లారీలను మరికొంతమంది అగంతకులు తీసుకువెళ్లారు. డ్రైవర్లు, కమీషన్ ఏజెంట్‌ను తొమ్మిది గంటలు తమ వాహనాలలో తిప్పుతూ రాత్రి 8 గంటల సమయంలో పాణ్యం సమీపంలోని ఎస్సార్బీసీ కెనాల్ వద్ద హైవే పక్కన లారీలతో పాటు వదిలేసి వెళ్లిపోయారు. దీంతో డ్రైవర్లు సమాచారాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటికే రైతు మహేంద్రారెడ్డి పాణ్యం ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి లారీలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాధితులను సీఐ నల్లప్ప విచారించారు. పూర్తి సమాచారం తెలుసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వెల్లడించారు.


కిడ్నాపైన డ్రైవర్లు

గాయత్రి హాస్పిటల్ యాజమాన్యంపై కేసు నమోదు

కర్నూలు, మార్చి 16: నగరంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తబస్టాండు దగ్గర ఉన్న గాయత్రి హాస్పిటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య తెలిపారు. ఆసరా జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసుపత్రి ఎండీ జిలాని, జ్యోతి డయోగ్నస్టిక్ సెంటర్ మేనేజర్ కిరణ్ కుమార్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఆసరా హెల్త్ స్కీం కింద పక్షవాతం, తదితర వ్యాధులు వచ్చే బాధితులకు ప్రభుత్వం రోగుల కోసం రూ.30వేలు, వైద్యం ఇచ్చేందుకు ఆసుపత్రికి రూ.20వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నేపథ్యంలో కొంత కాలంగా గాయత్రీ ఆసుపత్రి నుంచి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పక్షవాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. ఈ కేసుల కోసం ప్రభుత్వం రూ.5.5 కోట్ల నిధులు యాజమాన్యానికి చెల్లించింది. ఇలా పెద్ద ఎత్తున కేసులు రావడంతో అనుమానం వచ్చిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో దాదాపు కేసులన్నీ బోగస్ అని తేలింది. ఈ నేపథ్యంలో ఆసరా కోఆర్డినేటర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంత్రాలయం టికెట్‌పై పునరాలోచించాలి

- కోసిగిలో టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ
- ప్రజాభీష్టం మేరకే బరిలో ఉంటా
- మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి


కోసిగిలో టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కోసిగి, మార్చి 16: మంత్రాలయం టీడీపీ టికెట్‌పై టీడీపీ అధిష్ఠానం పునరాలోచించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అధినేత చంద్రబాబును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసిగిలోని మార్కండేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ మైదానం వరకు కొనసాగిన ర్యాలీలో తిక్కారెడ్డి కూడా పాల్గొన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లు మరోసారి పునరాలోచించి మంత్రాలయం టీడీపీ టికెట్ తనకే కేటాయించాలని తిక్కారెడ్డి కోరారు. తానేమి తప్పు చేశానని టికెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. రెండు నెలల ముందు వరకు వైసీపీలో ఉన్న మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోవర్టులకు టీడీపీ టికెట్ కేటాయించడం సబబు కాదన్నారు. టీడీపీ టికెట్ రాఘవేంద్రరెడ్డికి వస్తుందని మూడు నెలలకు ముందే వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చెప్పాడన్న విషయాన్ని తిక్కారెడ్డి గుర్తు చేశారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో తిక్కారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, నాయకులు రమాకాంత్ రెడ్డి, అయ్యన్న, వీరారెడ్డి, భరద్వాజశెట్టి, ఈరన్న, వెంకటేశ్ స్వామి, అమర్నాథ్ రెడ్డి, కోట్రేష్‌గౌడు, నరసమ్మ, సరోజ, శకుంతల తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ హాస్పిటల్ పోస్టుల ఫైనల్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కొత్తగా ఏర్పాటు అయిన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు సంబంధించిన 3 కేటగిరి అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టు, ఫైనల్ సెలక్షన్ లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు కేటగిరి అభ్యర్థుల లిస్టును కర్నూలు ప్రభుత్వ వెబ్‌సైట్ Https:kurnool.ap.gov.in నంద్యాల జిల్లా ప్రభుత్వ వెబ్‌సైట్ Https:nandyal.ap.gov.in మరియు కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్ Https:kurnoolmedicalcollege.ac.in లో అప్‌లోడు చేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ వరకు సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి. బెళగల్, మార్చి 16: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. మండలంలోని తుంగభద్ర నది నుంచి తెలంగాణలోని తిమ్మాళ, మానుదొడ్డి, పెద్దదన్‌వాడ గ్రామాలకు చెందిన ఐదు ట్రాక్టర్లు శనివారం ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. మాలెసోమాపురం, తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం గ్రామాలలో నుంచి ఇసుకను తరలిస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగన్న, హెడ్ కానిస్టేబులు, పోలీసలు ఉన్నారు.

ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ

ఆళ్లగడ్డ, మార్చి 16: ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సింహవాహనంపై జ్వాలా నరసింహస్వామిపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా బంగారు ధ్వజారోహణం చేశారు. దిగువ అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. సకాలంలో వర్షాలు కురవాలని దేశం సుభిక్షంగా ఉండాలని, విశ్వక్షేణుడిని పుట్ట బంగారంతో చేసిన మంటపంలో పూజించారు.

నేడు ఎగువ అహోబిలంలో....

అహోబిలం బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి సూర్యప్రభ వాహనం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు.

'స్పందన' రద్దు

నంద్యాల (కల్చరల్), మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని, ఈ మేరకు ప్రతి సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అడిషనల్ డీఎంఈగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 16: కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో ఆరుగురికి ప్యానల్‌లో ఏడీఎంఈగా పదోన్నతులు ఇచ్చారు. అందులో భాగంగా డాక్టర్ చిట్టినరసమ్మ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు. ఈ నెల ఒకటో తేదీన ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా ఆమె బాధ్యతలు స్వీకరించగా, 16 రోజులకే ఏడీఎంఈతో పాటు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా అవకాశం దక్కించుకున్నారు.

సెల్‌ఫోన్ కోసం దారుణం

- నానమ్మను చంపేసిన మనుమడు
- ఇంట్లోనే పాతిపెట్టి బంగారుతో ఉడాయింపు
- బంగారాన్ని విక్రయించి సెల్‌ఫోన్ కొనుగోలు
- రెండువారాల తర్వాత వెలుగులోకి
- కర్నూలు జిల్లా గోనెగండ్లలో అమానవీయ ఘటన


నాగమ్మ (ఫైల్)


వెంకటేష్

గోనెగండ్ల మర్చి 16: ప్రస్తుత సమాజంలో బంధాలు, బంధుత్వాలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట కట్టుకున్న వాడు, కావాల్సిన వాళ్ల, రక్తసంబంధీకులు దారుణాలకు ఒడిగడుతున్నారు. అదే కోవలోకే మరో ఘటన వచ్చి చేరింది. సెల్‌ఫోన్ కొనుగోలు చేసేందుకు డబ్బు లేకపోవడంతో సొంత నాన్నమ్మను హతమార్చి ఆమెపై బంగారాన్ని విక్రయించి మోజు తీర్చుకున్నాడు ఓ మనుమడు. అవ్వను హతమార్చి ఇంట్లోనే పాతిపెట్టిన సంఘటన గోనెగండ్ల మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా...

గోనెగండ్ల మండలంలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ నాగమ్మ(80)కు చిన్నబజారి, పెద్దబజారి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గ్రామంలో కూలీ పని చేసి జీవనం సాగించేవాడు. ఇతడికి భార్య పిల్లలు ఉన్నారు. చిన్న బజారి కర్నూలులో స్థిరపడ్డాడు. అయితే చిన్న బజరి పెద్దమరివీడులో సొంతింటిని నిర్మించి ఆ ఇంట్లో తన తల్లి నాగమ్మను ఉంచాడు. కురువ నాగమ్మ ఒంటరిగా ఆ ఇంట్లో జీవనం చేస్తుండేది. అయితే పెద్ద కుమారుడు పెద్ద బజారి గ్రామంలో కూలీ పనులు లేక పోవడంతో బతుకుదెరువు కోసం గుంటూరుకు భార్య, పిల్లలతో వలస వెళ్లాడు. వారి కుమారుడు వెంకటేష్ అక్కడ వ్యసనాలకు బానిసయ్యా డు. ఇదే సమయంలో వెంకటేష్‌కు కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేయాలన్న కోరిక కలిగింది. డబ్బులు లేక పోవడంతో సెల్ కొనలేకపోయాడు. ఇందుకోసం ఓ పథకం వేశాడు. తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి పెద్ద మరివీడుకు వచ్చాడు. తన నానమ్మ నాగమ్మ దగ్గర ఉన్న బంగారాన్ని దొంగలించి ఆ డబ్బుతో ఖరీదైన సెల్‌ఫోన్ కొనుగోలు చేయాలని భావించాడు. అనుకున్నదే తడవుగా ఈ నెల నాలుగో తేదీన నానమ్మ నాగమ్మ ఉన్న ఇంటికి మనుమడు వెంకటేష్ సాయంత్రం వెళ్లాడు. అక్కడ నాగమ్మ గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె శరీరంపై ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్‌ను తీసుకున్నాడు. రాత్రి వరకు అక్కడే వేచి చూసి వీధిలో ఎవరూ తిరగని సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న స్థలంలో గుంత తవ్వి అందులో పూడ్చివేశాడు. ఉదయం ఏమీ తెలియనట్లు ఎమ్మిగనూరుకు వెళ్లి అక్కడ ఓ దుకాణంలో దోచుకున్న బంగారును రూ.29 వేలకు విక్రయించాడు. వచ్చిన డబ్బు నుంచి రూ.25వేల పెట్టి కొత్త సెల్‌ఫోన్ కొన్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి ఏమి తెలియనట్లు గుంటూరులోని తన తల్లిదండ్రులకు దగ్గరకు వెళ్లాడు. ఈ నెల 13 తేదీన నాగమ్మ చిన్నమనుమడు గోపాల్ గ్రామానికి వచ్చాడు. తన నానమ్మ నాగమ్మ ఇంట్లో లేకపోవడంతో ఎక్కడికి వెళ్లిందని విచారణ చేశాడు. ఇంటిపక్కన వీధిలో విచారణ చేసినప్పటికి నానమ్మ జాడ కనిపించలేదు. దీంతో అనుమానంతో అదే రోజు గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. పెద్దమనుమడు వెంకటేష్ వచ్చి వెళ్లిన తరువాత ఈ సంఘటన జరగడంతో పోలీసులకు అనుమానం కలిగింది. తమదైన శైలిలో వెంకటేష్‌ను విచారించగా వాస్తవం బయటపడింది. శనివారం ట్రైనీ డీఎస్పీ భావన, గోనెగండ్ల సీఐ, పోలీసులు, వైద్యులు, తహసీల్దార్ సమక్షంలో 13 రోజుల తరువాత మృతురాలి శవాన్ని వెలికితీశారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల నియమావళి అమలులోకి

● ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

● ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, మార్చి 16 : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందని, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీలూ కోడ్ ఉల్లఘించిన వారిపై తీసుకున్న చర్యలపై రోజువారీ నివేదిక అందించేలా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, టీములతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధి నిర్వహణలో ప్రతి అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలలో 26 సెక్టోరల్ రూట్ అఫీసర్లు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, వారిని జీపీఎస్ ట్రాక్ సిస్టం ద్వారా నిరంతరాయంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎటువంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, లిక్కర్ తదితర వస్తువులు పట్టుబడ్డ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, బ్యానర్లు మొదలైన సామగ్రిపై వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు రికార్డు చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్కాడ్ టీమ్‌లు సీజ్ చేసిన నగదును కోర్టుకు సమర్పించాలని, ఎఫ్ఐఆర్ నమోదు కాని నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌కు సమర్పించాలని తెలిపారు. ఈ సెల్ తగిన ఆధారాలను పరిశీలించి నేరారోపణ లేకపోతే ఆ నగదును సంబంధిత వ్యక్తులకు అందజేస్తారన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలకు రూ.50 వేల లోపు నగదు మాత్రమే అనుమతి ఉన్నదని, రూ.50 వేలకు పైబడి ఉన్న నగదుకు సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. రాకీయ పార్టీ నాయకులు ప్రజలను ప్రలోభాలకు గురి చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎలక్షన్ విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, డీఎల్‌పీవో అధికారి వీరభద్రప్ప, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక బలగాల ఏర్పాటు : ఆర్డీఓ

పత్తికొండ , మార్చి 16 : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశామని, ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అందరూ నడుచుకోవాలని పత్తికొండ ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌టీంలు చెక్‌పోస్టువద్ద మద్యం తరలింపు, డబ్బు తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. వలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని, చిన్నపిల్లలను ప్రచారంలో ఉపయోగించుకోరాదని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు, ఇతర వర్గాలవారు ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, గోడపత్రికలు 24గంటలలోగా తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఏప్రిల్ 18న నామినేషన్ల కార్యక్రమం మొదలుకొని జూన్ 4న ఓట్లలెక్కింపు వరకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. నియమావళికి విరుద్ధంగా కార్యక్రమాలు జరిగినా, ఇబ్బందులు కలిగినా హెల్ప్‌లైన్ నెంబర్ 1950కి ఫోన్‌చేయాలని ప్రజలకు సూచించారు.

ఎన్నికల కోడ్ షురూ....!

ఆలూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ కుయాడంతో ఆలూరు పట్టణంలో అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో ఉన్న ఫ్లెక్సీ బోర్డులను ఈ వోఆర్డీ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో లో సిబ్బంది తొలగించి వేశారు.

విద్యార్థులతో బల్లలు మోయించిన గురువులు



బెంచిలు వేసేందుకు వెళ్తున్న విద్యార్థులు

మద్దికెర, మార్చి 16: 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పనుల్లో భాగంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు బల్లలు మోయించారు. మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో శనివారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదర్శ పాఠశాలలో ఉన్న బెంచీలను ట్రాక్టర్‌కు ఎత్తి బాలుర పాఠశాలలో వేశారు. ఈ దృశ్యాలను చూసిన పలువురు విద్యార్థులతో పని చేయించడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులతో బరువైన పనులను చేయించడం మంచి పద్ధతి కాదని, 'ఉపాధ్యాయులే ఇలాంటి పనులు చేయొచ్చు కదా.. అని నిలదీశారు. ఈ విషయంపై మండల విద్యాధికారి రంగస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులచేత పనులు చేయించడం మంచిది కాదని పేర్కొన్నారు.

'అమరజీవి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం '



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 16: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆర్యవైశ్య సంఘం నాయకులు సీనియర్ న్యాయవాది సురేష్ అన్నారు. శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ఉన్న పొట్టిశ్రీరాములు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఈర్లదిన్నె రమేష్, మధు, గోపాల్ పాల్గొన్నారు.

'మా వాహనాలకు సుంకం మినహాయించాలి '

మద్దికెర, మార్చి 16: "ప్రస్తుత పరిస్థితుల్లో మా జీవనోపాధే కష్టమైంది. బాడుగలు అంతంతమాత్రంగానే దొరకుతున్నాయి. మా వాహనాలకు పంచాయతీ వారు సుంకం మినహాయించాలి" అంటూ లారీ డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు వై.రాఘవేంద్ర, మల్లికార్జున, దస్తగిరి కోరారు. శనివారం ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నరసింహారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీ వారు రూ.200 సుంకం వసూలు చేయడం వల్ల లారీ ఓనర్లు తమకు ఇచ్చే వేతనాల్లో పట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "హైకోర్టు ఉత్తర్వుల మేరకు సుంకం మినహాయించాలని కోరారు. సర్పంచు బండారు సుహాసిని, ఉప సర్పంచు ప్రమీలమ్మ, కార్యదర్శి సంజప్ప తదితరులు ఉన్నారు.

మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగరేస్తాం

● అందరు సమష్టి కృషి చేస్తేనే విజయం మనదే

● తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం

● మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 16: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అన్ని వర్గాల కృషితోనే మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేస్తామని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, జనసేన మంత్రాలయం ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ జి.లక్ష్మన్న అన్నారు. శనివారం మండలంలోని మాధవరం గ్రామంలోని రాఘవేంద్రరెడ్డి నివాసంలో రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని స్పష్టం చేశారు. మంత్రాలయంలో మూడేళ్లుగా ఎమ్మెల్యే పని చేసిన బాలనాగిరెడ్డి రోడ్లను పట్టించుకోలేదన్నారు. వాల్మీకులు ఐక్యంగా పోరాడాలని ఎస్సీ ఎస్టీ, బీసీలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా తాను గెలిచితీరుతానని, ప్రతి కుటుంబంలో ఎమ్మెల్యేగా ఉంటూ అందరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. బీసీలకు టికెట్ ఇచ్చిన చంద్రబాబుకు, నారా లోకేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా కలసికట్టుగా ఉన్నామనీ, ఎవరూ ఎన్ని చెప్పినా నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్‌నాయకులు ఉలిగయ్య, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్ నాయుడు, నగేష్‌నాయుడు, సతీష్, సొట్టయ్య, విజయకుమార్, నరసిరెడ్డి, హనుమంతరెడ్డి, మాలపల్లి లక్ష్మయ్య, వీరేష్, బొజ్జప్ప, నరసింహులు, రామక్రిష్ణ, కౌలుట్లయ్య పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామికి ముత్యాల హారం



హారాన్ని భక్తులకు చూపుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 16: రాఘవేంద్రస్వామి మఠానికి మాజీ టీటీడీ బోర్డు చైర్మన్ ఆదికేశవుల నాయుడు అల్లుడు శ్రీనివాసమూర్తి బంగారు, ముత్యాలు, రత్నాలతో పొదిగిన విలువైన వైజయంతి వనమాలను విరాళంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు అందజేశారు. శనివారం రాఘవేంద్రస్వామి 429వ పుట్టినరోజు శుభ దినాన్ని పురస్కరించుకొని ఈ హారాన్ని విరాళంగా ఇచ్చారు. ఊంజల మంటపంలో హారాన్ని భక్తులకు చూపించి మూలరాములకు అలంకరణ చేశారు. అలాగే బెంగుళూరుకు చెందిన అక్షిత రూ. 50వేలు అన్నదానానికి విరాళం ఇచ్చారు. గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా రాఘవేంద్రస్వామి పుట్టిన రోజు వేడుకల్లో ప్రముఖులు పాల్గొనేందుకు కన్నడ ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యులు జగ్గేష్, దేవదాయ శాఖ రిటైర్డు కమిషనర్ సుందర్ కుమార్ శనివారం వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, బిందుమాధవ్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

12 అంతస్తుల భవన నిర్మాణానికి భూమి పూజ

మంత్రాలయం, మార్చి 16 : రాఘవేంద్ర సర్కిల్‌లోని పాత ఆర్అండ్‌బీ స్థలంలో రూ.25 కోట్లతో 12 అంతస్తుల భవన నిర్మాణానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్ భూమిపూజ చేశారు. రాఘవేంద్రస్వామి 429వ పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం రాత్రి మఠం ఈఈ సురేష్ కోణాపూర్, ఏఈ బద్రినాథ్ ఆధ్వర్యంలో శిలాఫలకం ఆవిష్కరించి భూమిపూజ చేశారు. శ్రీమఠంకు పీఠాధిపతి 12 ఏళ్ల పీఠం అధిష్ఠించిన జ్ఞాపకార్థంగా భక్తుల సకల సౌకర్యాల ఏర్పాటు కేంద్రం పేరుతో 12 అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. 12 అంతస్తుల భవన నిర్మాణం చేపట్టడం మంత్రాలయంలోనే ఇదే ప్రథమం. సాంకేతిక, ఆధునీకరంగా నిర్మించే భవనంలో పరిమళ ప్రసాదం, సేవ కౌంటర్, పార్కింగ్, లాకర్లు, ఫంక్షన్‌హాలు, భక్తులకు గదులు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. ఈభవనం పూర్తి అయితే మంత్రాలయానికి ప్రత్యేక ఆకర్షనీయంగా నిలుస్తుంది. కార్యక్రమంలో మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు.

వైభవంగా గంజహళ్లి ఉరుసు



ఉరుసులో పాల్గొన్న భక్తులు

గోనెగండ్ల, మార్చి 16: మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో బడేసాహెబ్ ఉరుసు మహోత్సవం శనివారం వైభవంగా సాగింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రార్థనలు చేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్గా నిర్వాకులు, ఆలయకమిటీ సభ్యులు గట్టి చర్యలు తీసుకున్నారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు.

రద్దీగా దుకాణాలు

ఉరుసులో మహిళలను, పిల్లలను, మట్టిగాజుల అంగళ్లు, బొమ్మల దుకాణాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి దర్శనం అనంతరం అంగళ్ల దగ్గరే మహిళలు పెద్ద ఎత్తున గుమిగూడి గాజులను, బొమ్మలను కొనుగోలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతరలు, ఉరుసులు అంటే జనంలో ఎంతో క్రేజీ ఉంటుంది. అందుచేత యువకులు, పిల్లలు, పెద్ద ఎత్తున ఉరుసుకార్యక్రమానికి హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే రంగురాట్నాలు కూడ పిల్లలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పోలీస్ బందోబస్తు

ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఆర్‌టీసీ బస్సులు, ఆటోలు, ట్రాక్టర్‌లు, ద్విచక్రవాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడకుండా మందుబాబులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. చిల్లర దొంగతనాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ముగ్గురు సీఐలు, తొమ్మిదిమంది ఎస్‌ఐలు దాదాపు 110 మంది పోలీసులు విధులు నిర్వహించారు దీంతో వ్యాపారాలు సజావుగా సాగడంతో వ్యాపారులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మాలలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఆస్పరి, మార్చి 16 : జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు మాలలకు రాజకీయ ప్రాధ్యాత కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పుష్పాంజలి, జిల్లా అధ్య క్షుడు మహానంది డిమాండ్ చేశారు. శనివారం ఆస్పరి ఎస్సీ హాస్టల్ ఆవరణలో ఎంపీపీ వేదేష్ అధ్యక్షతన నిర్వహించిన మా మహా గర్జన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో ఆయా పార్టీలు విస్మరించాయని విమర్శించారు. కన్వీనర్ భారత్, మానయ్య, వీరభద్ర, నాగరాజు, లక్ష్మణ్, నారాయణ, వెంకట రాముడు, వీరేష్, ప్రతాప్, సంజీవ్ పాల్గొన్నారు.

టీడీపీ సాధికార సమితి సభ్యుడి నియామకం

ఆదోని టౌన్, మార్చి 16 : తెలుగుదేశం పార్టీ వీరశైవ లింగాయత్ జిల్లా సాధికారక సమితి సభ్యుడిగా "కన్ని జగదీష్‌ను ఎంపిక చేస్తూ, కమిటీ రాష్ట్ర కన్వీనర్ యస్‌పీ శివరాజ్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెం నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ వీరశైవ లింగాయత్ సాధికారక సమితిలో తనను సభ్యుడిగా నియమించడం సంతోషంగా ఉందని జగదీష్ అన్నారు.

ఎన్నికల విధి విధానాలపై సమీక్షా

ఆదోని టౌన్, మార్చి 16 : రానున్న లోక్‌సభతో పాటు శాసనసభకు జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం మునిసిపల్ సిబ్బందితో కమిషనర్ రామచంద్రారెడ్డి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకారం అమలు చేయాల్సిన విధి విధానాలను గురించి సిబ్బందికి వివరించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.

గోరక్షణ ప్రతి హిందువు బాధ్యత

పెద్దకడుబూరు, మార్చి16: గోరక్షణ ప్రతి హిందువు బాధ్యతగా స్వీకరించాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శనివారం హెచ్. మురవణి గ్రామంలోని ఆంజినేయ స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

ఆలూరు, మార్చి 16 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఘర్షణలను ప్రోత్సహించిన చర్యలు తప్పవని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేసు అన్నారు. శనివారం సాయత్రం ఆలూరు పట్టణంలో ప్రత్యేక పోలీస్ బలగాలు కవాత్ నిర్వహించారు.

జగన్ పాలనంతా అబద్ధాల మయం

మద్దికెర, మార్చి 16: జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనంతా అబద్ధాలతో సాగిందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, మాజీ ఎంపీటీసీ పులి శేఖర్ అన్నారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఎన్నికలు వస్తుండటంతో అభివృద్ధి పేరుతో నానా యాగీ చేస్తున్నారన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తూ కాలాన్ని నెట్టుకొస్తున్నాడనీ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసే. బీజేపీ కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. నాయకులు కురువ అయ్యప్ప, చాకలి రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐదునెలల శిశువుకి డెంగీ

దేవనకొండ ,మార్చి 16: మండలంలోని పి.కోటకొండ లో ఐదునెలల శిశువు డెంగీజ్వరం బారీన పడిన్నట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు ,సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శిశువుకి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవైట్ వైద్యశాలకు వెళ్లారు. వైద్యులు పరిక్షించి డెంగీగా నిర్ధారించారు. సూపర్‌వైజర్ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి సుంకన్న గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకుని , రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు.

'పోటీకి వెళ్లి నష్టపోకండి'

మద్దికెర, మార్చి 16: పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చాల్సిన అధికారులు వేలం పాటాదారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో మొత్తం వేలంపాటలు వాయిదా పడ్డాయి. "ఆదాయం చూసుకోండి.. పోటికి వెళ్లి నష్టపోవద్దు" అంటూ హితువు పలకడంతో పాటాదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. శనివారం మద్దికెర గ్రామ సచివాలయంలో సర్పంచు బండారు సుహాసిని అధ్యక్షతన గ్రామంలో బస్టాండు, దినసరి సంత, వారపు సంత, కమేలాల నుంచి సుంకం వసూలు చేసేందుకు వేలంపాటలు నిర్వహించారు. 2024-25 సంబంధించిన వేలంపాటలన్నీ వాయిదా పడ్డాయి. గత ఏడాది నాలుగు సుంకాలకు సంబంధించి రూ.5 లక్షలకు పైగా వేలం పోగా.. ఈ ఏడాది వేలంపాటలో నలుగురు మాత్రమే పాల్గొని అన్ని కలిపి రూ.2 లక్షలలోపే పాటా పాడటంతో అధికారులు వాయిదా వేశారు. ఇన్‌చార్జి ఈవోఆర్డీ నరసింహారెడ్డి మాట్లాడూతూ మీరు నష్టపోకూడదనుకుంటే పోటాపోటీకి వెళ్లకుండా వేలంపాటలు పాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు ప్రమీలమ్మ, ఎంపీటీసీ రామక్రిష్ణ, కార్యదర్శి సంజప్ప, రామాంజనేయులు, అశోక్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

'పేద విద్యార్థులకు సహకారం అందిస్తా'

తుగ్గలి, మార్చి 16: హాస్టల్‌లో చదువుకుంటున్న ప్రతి పేద విద్యార్థికి అండగా ఉండి.. వారి అభ్యున్నతికి కృషి చేస్తానని జొన్నగిరి పాఠశాల పూర్వ విద్యార్థి మిద్దె వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు క్రీడా సామగ్రితో పాటు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రి, గోడ గడియారం, రూ.20వేలు విలువ చేసే సామగ్రిని అందించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరితే.. వారి కుటుంబం అభివృద్ధి చెందడంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల్లో హాస్టల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.5,016లు నగదు అందజేస్తామని తెలిపారు. వార్డెన్ రమేష్, ఉపాధ్యాయులు నగేష్, సుధ, బ్రహ్మానందరెడ్డి, ఈశ్వర్, నారప్ప, లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి రథోత్సవం

పత్తికొండ, మార్చి 16: సంతానవరదుడిగా భక్తులచే పూజలందుకుంటున్న పులికొండ రంగనాథస్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఈవో చంద్రశేఖర్‌రెడ్డి ఆధర్యంలో దేవాలయ ఆవరణంలోని కల్యాణమండపంలో స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని పండితులు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల రథోత్సవాన్ని నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులుకలగకుండా ఆలయనిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. సీఐ మురళీమోహన్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రమణీయం రథోత్సవం

ఆదోని రూరల్, మార్చి 16 : ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో రామదేవర, కాశీ విశ్వనాథ, ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు జామునుంచే దేవాలయంలో అర్చకులు గణపతి, గోపూజ, హోమం, కుంకుమార్చన వంటి పూజలు చేపట్టారు. సాయంత్రం జరిగిన రథోత్సవంలో పెద్దఎత్తున భక్తాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎద్దుల పోటీలు నిర్వహించారు.

వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్, మార్చి 16 : పత్తికొండ మండలం జె.కె తాండకు చెందిన రవికుమార్‌ను తాలుక పోలీసులు అరెస్టు చేశారు. సదరు వ్యక్తి ద్విచక్ర వాహనంలో సారాను తరలిస్తుండగా, శనివారం ఆస్పరి బైపాస్‌లో అదుపులో అతని వద్ద నుంచి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

మాచాని సోమనాథ్ వర్గీయుల ఆందోళన

ఎమ్మిగనూరు, 16: ఎమ్మిగనూరు టీడీపీ సీటు బీసీలకు కేటాయించాలని కోరుతూ టీడీపీ నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ వర్గీయులు శనివారం ఆందోళన నిర్వహించారు. స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలోని ఆయన ఇంటినుంచి మహిళలు, చేనేతలు సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీనిర్వహించారు. మాచాని సోమప్ప విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్కిల్‌లో టైర్లకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, మాచాని సోమనాథ్‌కు టీడీపీ సీటు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు సుధాకర్, గోకారమ్మ,నరసమ్మ, సరోజమ్మ, కామార్తి గంగాదర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చాయ రాము, తిరుమల రెడ్డి, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరుటౌన్, 16: మంత్రాలయం మండలంలోని చెట్నపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనంపై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు సబ్‌సీఐ భార్గవ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సెబ్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెట్నపల్లి శివారు ప్రాంతంలో ఎమ్మిగనూరుకు చెందిన గొల్ల గిడ్డయ్య, వడ్డే నవీన్, బోయ దర్మేంద్ర, మంత్రాలయంకు చెందిన బోయ మహానందిలు రెండు మోటారు బైక్‌లపై అక్రమంగా మద్యంను తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. వీరినుంచి 524 టెట్రాపాకెట్లును స్వాధీనం చేసుకున్నారు.

కోసిగి, మార్చి 16: ద్వీచక్రవాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకొని అతని నుంచి మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా తెలిపారు. ఈ ఏడాది జనవరి 23వ తేదీ నుంచి ఇప్పటి వరకు సెబ్ ఆధ్వర్యంలో అక్రమ మద్యం తరలిస్తున్న 43 కేసులలో 45 మందిని, 9 ద్విచక్రవాహనాలు, సుమారు 1118 లీటర్ల మద్యంను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

విశ్వమాత మదర్ థెరిసా విగ్రహం ఏర్పాటు

ఎమ్మిగనూరు, 16: పట్టణంలోని కలుగొట్ల రోడ్ ఎంబీ చర్చి ప్రాంతంలో వేదాస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విశ్వమాత మదర్ థెరిసా విగ్రహన్ని ఏర్పాటు చేశారు. వేదాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ నిర్వాహలు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని వైసీపీ సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఆపార్టీ సమన్వయకర్త బుట్టా రేణుకలు ఆవిష్కరించారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

కౌతాళం, మార్చి 16: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ రాజగోపురానికి శనివారం ఓ భక్తుడు రూ.50వేల నగదును విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వెంకటేష్, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప పట్టణానికి చెందిన అల్లయ్య శెట్టి, కుటుంబ సభ్యులు రూ.50 వేల నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి శేషావస్త్రాలు, ఫలపుష్పలను అందజేశారు.

టీడీపీ వర్గీయుడి పై వైసీసీ కార్యకర్త దాడి

వెల్దుర్తి, మార్చి, 16: వెల్దుర్తి పట్టణంలో టీడీపీ వర్గీయుడి పై వైసీపీ కార్యకర్త దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన వికలాంగుడైన రామకృష్ణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మగుండం తిరుణాలను పురస్కరించుకొని ఆర్‌కె రోడ్డులోని ఆటో స్టాండ్‌లో తోటి ఆటో కార్మికులతో కలసి టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. రెండు రోజుల నుంచి మీకు ఎంత ధైర్యం ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తారంటూ వైసీపీ కార్యకర్త దుర్భషలాడుతున్నాడు. ఈ విషయంపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ లేకపోవడంతో వెనక్కితిరిగివచ్చారు. శనివారం సాయంత్రం ఆటో స్టాండ్‌లో ఉండగా వైసీపీ కార్యకర్త దుర్భషలాడుతూ దాడి చేశాడు. దాడి చేసిన వైసీపీ కార్యకర్త పై కేసు నమోదు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో స్టేషన్‌లో ఉన్న పోలీసులకు ఫిర్యాదు అందించారు.

కేసు నమోదుచేయాలి

తనపై దాడి చేసిన వైసీపీ కార్యకర్త పై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితుడు రామకృష్ణ కోరారు. ఇంటి ఎదురుగానే వైసీపీ కార్యాలయం ప్రారంభించారని, తనకు మరింత రక్షణ అవసరమని పోలీసులకు తెలిపారు.